సెల్ టవర్లతో అనారోగ్య సమస్యలు

- ఏలూరులో నిబంధనల బేఖాతరు
- యథేచ్ఛగా సెల్ టవర్ల ఏర్పాటు
- నగరవాసుల ఆందోళన


గన్‌బజారులో నివాసాల మధ్య ఉన్న సెల్ టవర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సంకేతిక విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసింది. మొబైల్ ఫోన్ల రాకతో సమాచార మార్పిడి వ్యవస్థ అరచేతిలోకి వచ్చేసింది. నేడు సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. చిన్నపిల్లలు మినహా ప్రతి ఒక్కరి చేతిలోనూ సెల్‌ఫోన్ దర్శనమిస్తోంది. అవసరాలకు ఫోన్ ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, దాని వల్ల కొన్ని ఇబ్బందికర పరిస్థితులు కూడా ఉన్నాయి. సెల్‌ఫోన్లకు సిగ్నల్ అందించే టవర్ల వల్ల విపరీతమైన రేడియేషన్ ప్రజల ఆరోగ్యాలపై పెను ప్రభావమే చూపుతుంది. జనావాసాల మధ్య టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటి వల్ల నుంచి విడుదలయ్యే అధిక రేడియేషన్ కారణంగా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం

కొన్ని కార్పొరేట్ కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నాయి. సెల్ టవర్లను పాఠశాల భవనాలపై, నివాస గృహాల మధ్య ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. భూమి కంపించినా, గాలితో కూడిన వర్షం వచ్చినప్పుడు సెల్ టవర్లు కూలితే పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం ఏర్పడుతుంది. పట్టణాలు, గ్రామాల్లో నివాస గృహాల మధ్య ఒకే టవర్‌పై వివిధ కంపెనీలకు చెందిన పరికరాలు అమర్చడంతో అక్కడ అధిక రేడియేషన్ వెలువడుతోందని, ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరి

గ్రామీణ ప్రాంతాల్లో సెల్ టవర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ, పట్టణాల్లో అయితే టౌన్ ప్లానింగ్ అధికారుల నివేదిక అనుగుణంగా అనుమతులు ఇస్తారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ183) ప్రకారం అనుమతులు లేనిదే సెల్ టవర్ ఏర్పాటుకు వీలు లేదు. జిల్లాలో చాలా టవర్లకు అనుమతులు లేవని సమాచారం. స్థానిక అధికారులు కంపెనీ ప్రతినిధులతో చేతులు కలిపి అవసరానికి మించి సెల్ టవర్ల ఏర్పాటుకు అనుమతులిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ప్రతి డివిజన్‌లో నాలుగైదు టవర్లు

నగరంలోని దాదాపు ప్రతి డివిజన్‌లో సెల్ టవర్‌లు ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన ప్రజా బాహుళ్యం ఎక్కువగా నివసించే ప్రాంతాలు, మార్కెట్ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్ల వినియోగం అధికంగా ఉండే అవకాశం ఉండడంతో వినియోగదారులకు అంతరాయంలేని సేవలు అందించడానికి ఎక్కువ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎక్కువ మంది ఉండే ప్రాంతాల్లో ఎక్కువ రేడియేషన్ ఉండే ప్రమాదం లేకపోలేదు. ఇలా నగరంలో 50 డివిజన్లు ఉండగా ప్రతి డివిజన్‌లో తక్కువలో తక్కువ మూడు టవర్లు, గరిష్టంగా 6 టవర్లు ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఏలూరు మండలంలోని ఆయా గ్రామాల్లో కూడా సెల్ టవర్లు ఉన్నాయి. ఏలూరు మండలంలో కొల్లేరు ప్రాంతమే అధికంగా ఉండడం ఆ ప్రాంతం పక్షుల విడిది కేంద్రాలుగా గుర్తింపు ఉన్న ప్రాంతాల్లో కొన్ని అరుదైన పక్షి జాతులు నసించిపోతున్నాయని కొల్లేరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా టవర్ల ఏర్పాటు



నగరంలో ఇష్టానుసారంగా సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటి రేడియేషన్ ప్రభావంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఒక్కో భవనంపై ఒకే టవర్‌కు పలు కంపెనీలకు చెందిన పరికరాలు ఏర్పాటు చేయడంతో రేడియేషన్ అధిక మొత్తంలో విడుదలవుతోంది. జనావాసాల నడుమ ఉన్న టవర్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– రొంగల వాసు, కొత్తపేట

క్లుప్తంగా

జూట్ ఉత్పత్తులను వినియోగించాలి


జూట్ సంచులను చూపుతున్న మెప్మా అధికారులు

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ జూట్ ఉత్పత్తులను వినియోగించాలని మెప్మా సిటీ కోఆర్డినేటర్ శ్యాంప్రసాద్, జిల్లా రిసోర్స్ పర్సన్ అఖిల్ అన్నారు. స్థానిక లంకపేటలోని జోన్స్ ఎంటర్ ప్రైజెస్ జూట్ మేకింగ్ సెంటర్‌ను వారు గురువారం సందర్శించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఆన్‌లైన్, స్మార్ట్ విధానానికి అవకాశం కల్పించారని చెప్పారు. జూట్ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా మార్కెట్లో ప్రమోట్ చేస్తున్నారని జోన్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పెరికె దీన గ్లాడి తెలిపారు. సింధూర గ్రూపు సభ్యురాలు పోతురాజు మేరీ తనుజ ఫుడ్ ఐటమ్స్‌ను సెంటర్లో ప్రదర్శించారు. సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణలో భాగంగా జూట్ బ్యాగ్స్ అందరూ వాడాలని సూచించారు. కార్యక్రమంలో లంకపేట ఆర్పీ అనురాధ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రామకృష్ణాపురం, గులాబీ తోట, నెహ్రూ కాలనీ, విజయ గార్డెన్స్, మినీ బైపాస్, పవర్‌పేట, పాత బస్టాండ్, గూడ్స్‌షెడ్ రోడ్డు, వసంత మహల్ సెంటర్, పడమర వీధి, గొల్లాయగూడెం, సుబ్రహ్మణ్యం కాలనీ, వంగాయగూడెం, గాంధీ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో గురువారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. మొత్తం 61 రోజులకు స్వామి వారికి రూ.66,276 5 అమెరికన్ డాలర్లు లభించాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏలూరు పడమర వీధి వేంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి.రీనా మాధురి పర్యవేక్షించారు.

డిప్యూటీ మేయర్ ఎంపికపై 3న సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థలో డిప్యూటీ మేయర్ ఎంపికపై వచ్చే నెల 3న సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎ.భానుప్రతాప్ గురువారం తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డీటీసీ కృష్ణారావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డ్రైవర్లు తమ ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనరు కేఎస్‌ఎంవీ కృష్ణారావు సూచించారు. గురువారం స్థానిక ఉపరవాణా కమిషనర్ కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన ఆయుష్ ఆసుపత్రి వైద్యులచే డ్రైవర్లకు ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే డ్రైవర్లకు ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు, శంకర్ నేత్రాలయం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ భీమారావు, గేదెల ప్రసాద్, ఎస్ జగదీష్ బాబు, దుర్గా విఠల్, బాలమురళి తదితరులు డ్రైవర్ల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, హెల్త్ ఇన్సూరెన్స్ గురించి అవగాహన కల్పించారు. జంగారెడ్డిగూడెం ఆర్టీఓ మహనీయ, ఆయుష్ ఆసుపత్రి మేనేజరు జాస్టిక్ కాశీనాథ్, కార్యాలయ ఏఓ అనంత్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్టీఓలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

ఏలూరు (టూటౌన్): ఏలూరు నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు ఖర్చుచేస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. స్థానిక వన్ టౌన్‌లోని బిర్లా భవన్ సెంటర్ నుంచి గడియార స్తంభం కూడలి వరకు రూ.65 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు ఎమ్మెల్యే చంటి, మేయర్ షేక్ నూర్జహాన్‌లు గురువారం పరిశీలించారు. ఈ పనులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ రవిచంద్రకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎంఈ సురేంద్ర బాబు, డీఈ రజాక్, ఏఈ సాయి, కో ఆప్షన్ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఎల్ అండ్ టీ చైర్మన్‌పై చర్యలకు డిమాండ్

ఏలూరు రూరల్ : ఉద్యోగలు, కార్మికుల పని దినాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్ అండ్ టీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు గురువారం ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రామ్మోహన్, కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ పని గంటల పెంపు కార్పొరేట్ శక్తుల కోసమేనని ఆరోపించారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ గాయిత్రికి వినతిపత్రం అందజేశారు.

థెరిస్సా విద్యార్థినుల ప్రతిభ


విజేతగా నిలిచిన సెయింట్ థెరిస్సా కళాశాల హ్యాండ్‌బాల్ జట్టుతో అధ్యాపకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న వివిధ కళాశాలల జట్ల మధ్య నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థినులు విజేతలుగా నిలిచారని స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలిపారు. ఈ నెల 24న నిడదవోలు ఎస్‌వీడీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జి.పూజ, జి.పుణ్య, పి.నాగ వినయశ్రీలు అద్భుత ప్రతిభ కనబర్చారని చెప్పారు. వీరు త్వరలో తమిళనాడులోని కారేపూడి అలగప్ప విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు నన్నయ యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో అన్నవరంలోని ఎస్‌వీవీఎస్‌డీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్ బాల్ పోటీల్లో తమ కళాశాల జట్టు విజేతగా నిలిచిందన్నారు. ఈ జట్టులోని ఎ.షల్లి, జి.పుణ్య, ఎస్ జెస్సి తన్మయ్, టి.జ్యోతిలు తమిళ నాడు సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కి ఎంపికయ్యారని వివరించారు. ఈ జట్లను గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఈ జట్లను నడిపించిన ఫిజికల్ డైరెక్టర్ మేజర్ పి.సెలిన్ రోజ్, వ్యాయామ అధ్యాపకురాలు శ్యామల చేసిన కృషిని అభినందించారు.

పేదలకు ఉపాధి కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భాను ప్రతాప్

ఏలూరు (టూటౌన్) : పట్టణ పేదల జీవన స్థితిగతులు మెరుగు పర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ఎ.భాను ప్రతాప్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), దీనదయాళ్ జాతీయ పట్టణ జీవనోపాధుల సంస్థ మార్గదర్శకాల ప్రకారం అన్ని పట్టణాల్లో సిటీ లైవిలిహుడ్ యాక్షన్ ప్లాన్ (సి–లాప్) రూపొందించి, పట్టణంలోని పేదలందరికీ వారి సామర్థ్యం, నైపుణ్యం ఆధారంగా జీవనోపాధిని కల్పించి, వారి తలసరి ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. స్థానిక కమిషనర్ చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి కమిషనర్ అధ్యక్షత వహించారు. సిటీ లైవిలిహుడ్ టాస్క్ ఫోర్సు కమిటీ సభ్యులు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో రాబోయే ఐదేళ్లకు సిటీ లైవిలిహుడ్ యాక్షన్ ప్లాన్ (సి–క్లాప్) రూపకల్పనపై చర్చించారు. ఉద్యోగ అవకాశాల విస్తరణ, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, పట్టణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను పెంపొందించే విధంగా కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన చేయాలని కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల అధికారి ఎస్‌ఎస్‌వై సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్మికశాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాసరావు లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ డి.నీలాద్రి, మున్సిపల్ ఇంజినీర్ సురేంద్రబాబు, ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవీఎస్‌కే కృష్ణమూర్తి, హెచ్‌ఎం ఎ.కుటుంబరావు, హేలాపురి లైన్స్ క్లబ్ అధ్యక్షులు పీవీ రమణ, డీబీఆర్‌సీ జిల్లా కన్వీనర్ ఎస్ జ్యోతి, వేంగి పట్టణ సమైక్య అధ్యక్షురాలు వి.రాజ రాజేశ్వరి, కార్యదర్శి కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దాం


గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని వక్తలు కోరారు. గురువారం ఏలూరు కోట దెబ్బ సర్వీస్ రిజర్వాయర్ ఒకటి విశ్రాంతి ఉద్యోగుల కార్యాలయం (ఏఐటీయూసీ) వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి డి.జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, వాటర్ సప్లై అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ వర్ధంతి కార్యక్రమాన్ని యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి డీఈఈ రజాక్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఏఈఈ సాయి పూల దండలు వేసి నివాళులర్పించారు. యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, సహాయ కార్యదర్శి ఎస్‌ఎంవీ సుబ్బారావు, యూనియన్ నాయకులు మధ్యాహ్నపు దుర్గారావు మాట్లాడారు. కార్యక్రమంలో ట్యాప్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ బాబు, యూనియన్ నాయకులు బొంతు దుర్గారావు, షేక్ అక్బర్ బాషా, పి.దుర్గారావు, ఎం ఆదినారాయణరావు, ఎంఎస్ బాజీ, టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలి

ఏలూరు (టూటౌన్): బుట్టాయిగూడెంలో గురువారం ఉదయం పేదల గుడిసెల కూల్చివేతను అడ్డుకునేందుకు వచ్చిన సీపీఎం బుట్టాయిగూడెం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, ఇళ్ల స్థలాల పోరాట నాయకులు కుంజా సత్యనారాయణను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఈ వ్యవహారంలో గిరిజనేతర భూస్వాములకు కొమ్ము కాసిన రెవెన్యూ, పోలీస్ అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, అరెస్ట్ చేసిన సీపీఎం నాయకులు వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అరెస్టులకు ఖండన

పేదల పక్షాన నిలబడిన గిరిజన నేతలను అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. అరెస్టు చేసిన నాయకులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


చేపల తూము సెంటర్ సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎన్నికల వాగ్దానం మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పేదల అర్జీలను స్థానిక చేపల తూము సెంటర్ వార్డు సచివాలయంలో కార్యదర్శికి గురువారం అందజేశారు. ఎన్నికల హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 10న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కారం దారయ్య, పుప్పాల కన్నబాబు, వరక శ్యామల, మన్నవ యామిని, భజంత్రీ శ్రీనివాసరావు, కె.రోజా, బి.లక్ష్మి, ఎ.మల్లీశ్వరి, శ్రావణి, ఉమా గౌరి, కె.చంద్రకుమారి, ఎం కోటేశ్వరి, బి.ప్రసన్న రాణి, కె.దేవి, వి.స్వప్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై వినతి

భీమడోలు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం యూటీఎఫ్ స్థానిక శాఖ నాయకులు ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావుకు భీమడోలు ఎంఆర్సీలో వినతిపత్రం అందజేశారు. పని సర్దుబాటు పేరుతో అసంబద్ధ డెప్యూటేషన్లు వల్ల పాఠశాలల నిర్వహణ కష్టంగా ఉందని, కార్యాలయం నుంచి పంపించే మెస్సేజులతో టీచర్లు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఒత్తిళ్లతో విధులు నిర్వర్తిస్తున్నామని, విద్యాశాఖ అధికారుల సందర్శించే తరుణంలో పాఠశాల నిర్వహణలోని లోపాలను ఎత్తి చూపుతున్నారని, ఇదే తరుణంలో చక్కగా పని చేసే వారిని కూడా ప్రోత్సహించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఈఓ హామీ ఇచ్చినట్టు యూటీఎఫ్ నాయకులు తెలిపారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రబాబు

ఏలూరు (టూటౌన్): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు విమర్శించారు. ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా ముఖ్య నాయకులు సమావేశం ఏలూరు స్ఫూర్తి భవన్‌లో జిల్లా కన్వీనర్ తొర్లపాటి రాజు అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. రాజేంద్ర బాబు మాట్లాడుతూ కూటమి నేతల హామీ మేరకు తక్షణమే డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యలపై చర్చించాలని, నిరుద్యోగ భృతి ప్రకటించాలన్నారు. అమరావతి రాజధానిని ఫ్రీ జోన్ చేసి 26 జిల్లాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారికి రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు భజంత్రీ శ్రీనివాస్, కన్వీనింగ్ కమిటీ సభ్యులు ప్రసాద్, ప్రసన్నకుమార్, తాళ్లూరి నాగరాజు, కృష్ణ శేఖర్, అంబేద్కర్, ఏఐఎస్‌ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా కోశాధికారి కె.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంరక్షణే ధ్యేయం

పెదవేగి : మహిళల సంరక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోందని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల్లో గురువారం మహిళా ఎస్సై కాంతి ప్రియ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా అభయ మహిళా రక్షక దళ సభ్యులు పెదవేగి మండలం దుగ్గిరాల దంత వైద్య కళాశాల ప్రాంతంలో గస్తీలు నిర్వహించారు. సైబర్ నేరాల నివారణకు జాబు ఫ్రాడ్స్, లోన్ ఫ్రాడ్స్, ఏపీకే యాప్‌ల ద్వారా జరిగే మోసాలపై ప్రజలకు దృశ్య రూపంలో వివరించారు. సోషల్ మీడియా ద్వారా వెలువడే ముప్పులపై అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలు, వృద్ధుల రక్షణకు ఎస్పీ ఏర్పాటుచేసిన వాట్సాప్ నెంబర్ 95503 51100కు సమాచారం అందించిన వెంటనే పోలీస్ సేవలు అందుతాయని వివరించారు.

'స్పర్శ'తో కుష్టుపై అవగాహన

దెందులూరు: స్పర్శతో కుష్టి వ్యాధిపై సమాజంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా లెప్రసీ ఎయిమ్స్ టీబీ ఆఫీసర్ ఎం నాగేశ్వరరావు అన్నారు. గురువారం వేగవరం డామియల్ లెప్రసీ సెంటర్‌లో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యానందం సిస్టర్ రోసి ఆధ్వర్యంలో ఆయన స్పర్శ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 13వ తేదీ వరకు స్పర్శ కొనసాగుతుందని చెప్పారు. కుష్టి పూర్తిగా మందులతో తగ్గుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేస్తారని, వ్యాధి నిర్ధారణ అయితే సమీప ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకోవాలని అన్నారు. వేగవరం ఆర్‌సీఎం ఫాదర్ మోజస్, డామేస్ లెప్రసీ సెంటర్ సిస్టర్ రోసి మాట్లాడుతూ కుష్టుకు సరైన సమయంలో మందులు వాడి వ్యాధిని నయం చేసుకోవాలన్నారు. డామియల్ లెప్రసీ సెంటర్‌లో బాధితులకు మందులు, చెప్పులు, దుస్తులను అందజేశారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు అన్నారు. గురువారం వేగవరం హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సైబర్ మోసాలపై ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఇష్టపడి క్రమశిక్షణతో చదవినప్పుడే ఫలితం ఉంటుందని అన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	22
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	24	బిళ్లచిక్కుడు	60
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	68
కాకర కాయలు	38–44	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07–10
దోసకాయలు	30	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44